క్లుప్తంగా

అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేయాలి



మోపాల్: మండలంలోని బైరాపూర్ శివారులోని మోతీరాంనాయక్ తండాలో గిరిజనులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటపై గడ్డి మందు చల్లి ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేయాలని ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామావత్ మోహన్ నాయక్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి నాయక్, చౌహాన్ మోహన్ నాయక్, పీర్‌సింగ్, గంగాధర్, రవి రాథోడ్, బాలు నాయక్, ఇందల్, జలంధర్, గౌతమ్, కమలాజీ, రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ అధికారికి ఆర్థికసాయం



నిజామాబాద్‌అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వసతి గృహ అధికారి రాజేందర్‌కు శుక్రవారం వార్డెన్ల సంక్షేమ సంఘం ఆర్థిక సహాయాన్ని అందించింది. కామారెడ్డి జిల్లా జుక్కల్ వసతి గృహాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజేందర్ ఈనెల 6న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో సంక్షేమ వసతి గృహ అధికారులు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ రూ. 80 వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో వసతి గృహాధికారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చేందర్, టీఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ జాఫర్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



నిజామాబాద్ నాగారం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కోశాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని వివేకానందనగర్ కాలనీలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.లింబాద్రి, పి.రాఘవేందర్, కోశాధికారి ఎ.రాజేందర్, జి.రామకృష్ణ రెడ్డి, గంగాదాస్, వెంకటరమణ, బాబుకృష్ణ, రాజశేఖర్, కాలనీవాసులు నర్సింహారెడ్డి, నర్సారెడ్డి, తుకారాం, విజయలక్ష్మి, శారద, రవి, కృష్ణ, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



జక్రాన్‌పల్లి: ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారిణి దేవిక సూచించారు. శుక్రవారం మండలంలోని కొలిప్యాక్‌లో ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు రాయితీ కింద డ్రిప్ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. హార్టికల్చర్ అధికారి రాజు, ఏఈవో శివ ప్రసాద్, ప్రీ యూనిక్ కంపెనీ క్లస్టర్ ప్రతినిధి రాకేశ్, గ్రామ మాజీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,600	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	93,795	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	60	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	50	90
బీరకాయ	20	40	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	25	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	20	40	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	40	80
కొత్తిమీర	20	40	బిక్కుడుకాయ	30	60
పుదీనా	30	60	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్





జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరాలయంలో వ్రతపూజలు నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మి వ్రతశోభ



వినాయక్‌నగర్‌లోని భూలక్ష్మీ ఆలయంలో..



పాములబస్తీలో ఉన్న నల్లపోచమ్మ ఆలయంలో..



గంగస్థాన్ ఫేస్-2లో సూర్య రెసిడెన్సీలో..



డిచ్‌పల్లి బెటాలియన్‌లో..

నిజామాబాద్ రూరల్/ డిచ్‌పల్లి: వరాలను అందించే వరలక్ష్మి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో ఆడపడుచులు వైభవంగా వరలక్ష్మి వ్రతాలు చేశారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో సామూహిక వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, శివాజీనగర్‌లో ఉన్న గీత ఆలయం, న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న లలితాదేవి ఆలయం, దుబ్బలో ఉన్న మహాలక్ష్మి ఆలయం, కోటగల్లిలో ఉన్న మార్కండేయ మందిరం, నల్లపోచమ్మ ఆలయం, వినాయక్ నగర్‌లో ఉన్న భూలక్ష్మి ఆలయం, మారుతినగర్, నాందేవాడలో ఉన్న అమ్మవారి ఆలయాల్లో, డిచ్‌పల్లి మండల కేంద్రంలో, పోలీస్ బెటాలియన్‌లోని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వర్సిటీ హాస్టల్ డిపాజిట్ ఫీజు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విఘ్నేశ్

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో ఏ ఇతర యూనివర్సిటీల్లో లేని విధంగా తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్ డిపాజిట్ ఫీజులు ఆకాశన్నంటుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ విమర్శించారు. శుక్రవారం తెయూ న్యూబాయ్స్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు రూ.10 వేలు, నాన్ స్కాలర్‌షిప్, ఓసీ విద్యార్థులకు రూ.18వేల చొప్పున డిపాజిట్ వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజు, వర్సిటీ అధ్యక్షుడు జీషన్, ఉపాధ్యక్షులు నాగేంద్ర, నిరంజన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుపై ఆరోపణలు అవాస్తవం

డిచ్‌పల్లి: మహిళా సంఘాల సభ్యుల రుణాల మంజూరుకు సంబంధించి శుక్రవారం వివిధ దినపత్రికల్లో మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ చేసిన ఆరోపణలు అవాస్తవమని డిచ్‌పల్లి డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాబార్డు, బ్యాంకు ఉన్నతాధికారులు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అనుసరించి రుణాలు మంజూరు చేస్తామన్నారు. నిబంధనల ప్రకారం సంఘం పొదుపు ఖాతాలో ఉన్న కార్పస్‌ఫండ్‌కు పదిరెట్లు రుణం మంజూరు చేస్తామన్నారు. పెద్ద మొత్తంలో మహిళా సంఘాల రుణాలు మంజూరు చేసినప్పుడు నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. అలాగే ప్రతి సభ్యురాలికి విధిగా రుణం ఉన్నన్ని సంవత్సరాలు ప్రధానమంత్రి ఇన్సూరెన్స్ యోజన రూ.20లు, పీఎంజేజేబీవై రూ.436 చేయించాలని ఆదేశాలున్నాయన్నారు. వీటిని అనుసరించి సభ్యురాలి ఖాతాలో 3 సంవత్సరాలకు సరిపడ బీమా డబ్బులు సుమారు రూ.1500, బ్యాంకు నిబంధనల ప్రకారం మినిమమ్ బ్యాలెన్స్ రూ.వేయి, సభ్యుల వ్యక్తిగత పొదుపు ఖాతాలో మొత్తంగా బ్యాలెన్స్ రూ.2,500 ఉండాలని చెప్పడం జరిగిందన్నారు. దీనికి మహిళా సంఘాల సభ్యులు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నారు. ఈ విషయమై ఐకేపీకి సంబంధించి డీపీఎం సంధ్యారాణి, డిచ్‌పల్లి ఏపీఎం రవీందర్ బ్యాంకుకు వచ్చి చర్చలు జరిపి ఎలాంటి అభ్యంతరం తెలుపలేదని మేనేజర్ పేర్కొన్నారు. మహిళా సంఘాల రుణాలకు, సొసైటీ (పీఏసీఎస్) లకు ఎలాంటి సంబంధం లేకపోయినా మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ బ్యాంకుపై ఆరోపణలు, ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. నాబార్డు ఇచ్చిన నిబంధనలను ఉల్లంఘించి రుణాలు మంజూరు చేయలేమని స్పష్టం చేశారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు



ఫ్యూచర్‌లైన్ పాఠశాలలో రాఖీలు కట్టిన విద్యార్థినులు



డిచ్‌పల్లి: వివేకానంద పాఠశాలలో..

నిజామాబాద్‌అర్బన్/ డిచ్‌పల్లి/ సిరికొండ: నగరంలో పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల్లో రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో, డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లోని వివేకానంద పాఠశాలలో, సిరికొండ మండల కేంద్రంలోని కిడ్స్‌పార్క్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు చేపట్టారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చాంద్‌మియాబాగ్ తండాలో తీజ్



జక్రాన్‌పల్లి: మండలంలోని చాంద్ మియాబాగ్ తండాలో శుక్రవారం గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తండా పెద్దలు శంకర్, మహేశ్, రవినాయక్, మోతి సింగ్, రవి, అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు వినతి



నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధ్యాయ పదోన్నతుల్లో స్వచ్ఛందంగా తమకు పదోన్నతి వద్దు అనుకునే వారికి నాటు విల్లింగ్ ఇచ్చి పదోన్నతి నుంచి తప్పుకునే అవకాశాన్ని కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, గంగాధర్ కోరారు. డీఈవో అశోక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేతరి మల్లేశ్, శీను, ప్రతాప్, శ్రీనివాస్, లక్ష్మణ్, రవి, అశోక్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు పట్టించాలి

జక్రాన్‌పల్లి: పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునంద అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గోద గంగలక్ష్మి, కవిత, సవీణ ఏఎన్ఎం స్వరూపం, ఆశా వర్కర్ లత పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని స్కిల్ డెవలప్‌మెంట్ ఎంప్లాయిమెంట్ ట్రెయినర్ గోపిక అన్నారు. నగరంలోని వాణి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని రాఖీలు తయారు చేయించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రమేశ్ గౌడ్, మహేశ్ కుమార్, ప్రిన్సిపాల్ స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసాను అమలు చేయాలి

సిరికొండ: భూమి లేని పేదలకు ఇందిరా ఆత్మీయ భరోసాను వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి కిశోర్ డిమాండ్‌చేశారు. మండలంలోని గడ్కోల్‌లో జీపీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు లింబాద్రి, కిరణ్, అనీస్, కిశోర్, కట్ట రాములు, ఎర్రన్న, రాములు, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



ట్రీగార్డులు వృథాగా..

నిజామాబాద్ సిటీ: మొక్కల రక్షణ కోసం కొనుగోలు చేసిన ట్రీగార్డులను మున్సిపల్ అధికారులు వృథాగా పడేశారు. గతేడాది హరితహారం కార్యక్రమంలో కొనుగోలు చేసిన వీటిని పెద్ద సంఖ్యలో జోన్-2లోని గోల్‌హనుమాన్ శానిటేషన్ కార్యాలయంలో ఓ మూలన పడేశారు. ఓ పక్కన నాటిన మొక్కలు పశువులు తింటున్నాయి. మరోపక్క రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ట్రీగార్డులను వృథాగా పడేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. – రామగిరి శంకర్, కసాబ్‌గల్లి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

కార్మికుల రిటైర్మెంట్ వయస్సు పెంచాలి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న హమాలీ, చాట కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 65కు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్‌కు నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. హమాలీ, చాట కార్మికుల లైసెన్సుల రెన్యూవల్ వయస్సు 58 నుంచి 65 ఏళ్లకు పెంచాలన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు పెంచి పని చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన అడిషనల్ డైరెక్టర్ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య, మార్కెట్‌యార్డు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరుశరాం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ధర్నా

నిజామాబాద్ సిటీ: ఎన్నికల కమిషన్ పక్షపాత వైఖరిని విడనాడి, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పులాంగ్ వద్ద ధర్నా నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా నుంచి మైనారిటీలు, దళితుల ఓట్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ బీజేపీ ఒత్తిడికి తలగ్గొడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. నాయకులు రమేశ్‌బాబు, పెద్ది వెంకట రాములు, శంకర్ గౌడ్, వెంకటేశ్, నన్నేసాబ్, బెజుగం సుజాత, సురేశ్, విఘ్నేశ్, కటారి రాములు, నల్వాల నర్సయ్య, కృష్ణ, రాజు, నరసయ్య, రఫిక్ పాల్గొన్నారు.

తెయూ రిజిస్ట్రార్‌కు వినతి

తెయూ(డిచ్‌పల్లి): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ, పీజీ కళాశాలలను తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ పరిధిలోకి తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెయూ రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్నాయన్నారు. ఆయా కళాశాలల విద్యార్థులు సర్టిఫికెట్లు, ఇతర అవసరాల కోసం 200-300 కిలోమీటర్ల దూరంలోని కాకతీయ యూనివరిటీకి వెళ్లాల్సి వస్తోందన్నారు. అదే నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు తెలంగాణ యూనివర్సిటీ 100 కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ యూనివర్సిటీ పరిధిని విస్తరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, దేవిక, రాకేశ్, లహరి, రాజేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



కాల్పోల్‌లో అలుగు పారుతున్న ఊర చెరువు

మోపాల్/ నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని కాల్పోల్ ఊర చెరువు అలుగు పారుతోంది. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు అటవీ ప్రాంతాల గుండా వరద చెరువులోకి వచ్చి చేరుతోంది. అదే విధంగా మంచిప్ప పెద్ద చెరువుతోపాటు బాడ్సి, కంజర్, ముదక్‌పల్లి, సిర్‌పూర్, తదితర చెరువుల్లోకి కూడా వరద వచ్చి చేరుతోంది. ఊర చెరువు అలుగు పారడంతో అటవీ ప్రాంతంలో ఉన్న కాల్పోల్ వాటర్ ఫాల్స్ సందడిగా మారనుంది. రూరల్ మండలంలోని మల్కాపూర్ తండా చెరువు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నిండుకుండలా మారి అలుగు పారుతోంది. దీంతో గ్రామస్తులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హరిచరణ్‌లో జీవన్ దాత వందన ఉత్సవం



నిజామాబాద్ రూరల్: మార్వాడీ యువ మంచ్ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో హరిచరణ్ మార్వాడీ హిందీ విద్యాలయంలో 'జీవన్ దాత వందన ఉత్సవం' నిర్వహించారు. స్కూల్‌లో విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి వారిని నమస్కరించారు. అనంతరం దుబ్బా ప్రాంతంలోని అక్షరధామ్ స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో మార్వాడీ యువ మంచ్ అధ్యక్షుడు సందీప్ సార్డా, అఖిల భారతీయ మార్వాడీ యువ మంచ్ జాతీయ అధ్యక్షుడు సురేశ్ ఎం జైన్, ఆంధ్రా-తెలంగాణ మార్వాడీ యువ మంచ్ ప్రాంతీయ అధ్యక్షుడు మనీష్ నహర్, శ్రీకాంత్ ఝున్వర్, ఉదయ ఉపాధ్యాయ్, అనురాగ్ భంగడియా, రాఘవ ఉపాధ్యాయ్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్ రూరల్: చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర చేనేత గౌరవ అధ్యక్షుడు చెలివేరి గణేశ్ అన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని చేనేత సహకార సంఘం భవనంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. చేనేత కార్మికులకు తక్కువ ధరకే వారు తయారు చేసే మెటీరియల్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అంతకుమందు పలువురు చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిలివేరి శంకర్, రాష్ట్ర సలహాదారులు కొండి రమేశ్, బీమర్తి రవి, బొట్టు వెంకటేశ్, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రజతోత్సవ మహాసభల్లో సత్యానంద్

నిజామాబాద్‌అర్బన్: కోల్‌కతలో ఈ నెల 8 నుంచి10వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవ మహాసభలకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్ హాజరయ్యారు. ఈ మహాసభల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారుగా 37 మంది ప్రతినిధులు హాజరుకాగా జిల్లా నుంచి డి. సత్యానంద్ పాల్గొన్నారు. మహాసభల్లో జాతీయ విద్యా విధానాన్ని పునరుద్ధరించాలని, మధ్యాహ్న భోజన స్లాబ్ రేట్స్ పెంచాలని, విద్యార్థులకు సరిపడా అన్ని రకాల స్టేషనరీ అందించాలన్న అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

సిరికొండ: మండలంలోని తూంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీజేపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మంజూరు చేసిన నిధులతో లైట్లను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు అన్నారం గంగామురళి, మండల కార్యదర్శి జినుక రాజేందర్, బూత్ అధ్యక్షుడు అరిగెల రమేశ్, సత్తూర్ రవి, బూస రాజు, గంగాధర్, రాజేశ్వర్, నరేశ్, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యసమాజ్‌లో యజ్ఞం

నిజామాబాద్ రూరల్: ఇందూరు ఆర్యసమాజ్‌లో శ్రావణ మాస యజుర్వేద పారాయణ యజ్ఞములను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మి వ్రతాల సందర్భంగా రామగిరి సుదర్శన ముని సిద్ధిరాములు, కరిపె సూర్యప్రకాశ్, మల్లికార్జున, ప్రశాంత్ దంపతులు పూజలు చేశారు.

వీడీసీల ఆగడాలను అరికట్టాలి



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో వీడీసీల ఆగడాలని అరికట్టాలని దళిత సంఘాల బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాద్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో మాదిగ కులస్తులను గ్రామ అభివృద్ధి కమిటీ బహిష్కరించడం అన్యాయం అన్నారు. ఆ గ్రామంలో మడిగెల పంపిణీ విషయంలో తలెత్తిన వివాదంలో వీడీసీ కులస్తులను బహిష్కరించి వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందకుండా చేయడం దారుణమన్నారు. వ్యవసాయ పనులు జరగకుండా, నిత్యావసర సరుకులు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

ఇందల్వాయి: భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆర్డీవో రాజేంద్ర కుమార్ అధికారులకు సూచించారు. ఇందల్వాయి తహసీల్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా తొందరగా విచారణ చేపట్టి సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రేషన్‌కార్డుల దరఖాస్తులను విచారణ చేపట్టి అర్హులకు రేషన్‌కార్డులు అందేలా చూడాలన్నారు. తహసీల్దార్ వెంకట్‌రావు, డీటీ శైలజ, ఆర్ఐ మోహన్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.